క్లుప్తంగా

పలువురికి ఎమ్మెల్యే కిలివేటి పరామర్శ

ఓజిలి: మండలంలోని మానవాలి గ్రామంలో ఉప సర్పంచ్ గడ్డం హరిబాబురెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం పరామర్శించారు. ఇటీవల హరిబాబురెడ్డి చెల్లెలు శైలజా అనారోగ్యంతో మృతిచెందడంతో వారిని పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే చిల్లకూరు చంద్రమ్మ, పద్మనాభరెడ్డిని కూడా ఎమ్మెల్యే కిలివేటి పరామర్శించారు. వీరి కుమారుడు సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన వెంట తిరుపతి పార్లమెంట్ జిల్లా కార్యదర్శి పాదర్తి హరినాథ్ రెడ్డి, ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, కాటంరెడ్డి వేణు రెడ్డి, అరభూమి రాజారెడ్డి, సురేంద్రరెడ్డి, మధురెడ్డి తదితరులు ఉన్నారు.

నిబంధనల మేరకే విక్రయాలు

పెళ్లకూరు: మండల పరిధిలోని తాళ్వాయిపాడు, పెళ్లకూరు, చెంబేడు గ్రామాల్లోని మద్యం దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు చేస్తున్నట్లు ఆయా షాపుల సూపర్‌వైజర్లు తెలిపారు. గురువారం తాళ్వాయిపాడు షాపు వద్ద సూపర్‌వైజర్లు విలేకరులతో మాట్లాడారు. మద్యం విక్రయాలపై కొందరు దుష్ప్రచారం చేస్తుండడాన్ని ఖండించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుబ్రమణ్యం, వెంకయ్యబాబు, సాయిరామ్, కిరణ్ కుమార్, మురళీధర్, గురవయ్య పాల్గొన్నారు.

బాలసదన్‌లో సీట్ల భర్తీకి చర్యలు

కోట: కోట బాలసదన్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు బాలసదన్ సూపరింటెండెంట్ దుర్గాదేవి గురువారం తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు 20 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, ఎటువంటి ఆసరా లేని వారికి బాలసదన్‌లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. బాలసదన్‌లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు కోట బాలసదన్‌లో సంప్రదించాలన్నారు.

ముందస్తు రంజాన్ వేడుకలు



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

కోట: కోట బీసీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ముందస్తు రంజాన్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు రంజాన్ పర్వదినం విశిష్టతను టీచర్లు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణరావు, బాష, యస్దానీ పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

చిట్టమూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు చలివేంద్రం ప్రారంభించారు. రాష్ట్రప్రభుత్వం, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ యువరాజ్, ఈఓపీఆర్డీ మనోహర్ గౌడ్, ఆర్ఐ మధులత, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ మ్యుటేషన్లపై దృష్టి పెట్టండి



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ ఏడుకొండలు

చిల్లకూరు : భూమి లేకుండానే కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేసుకుని తప్పుడు పత్రాలతో పట్టాదారు పాస్ పుస్తకాలు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మన్నెంగుంట సర్పంచ్ ఏడుకొండలు రైతులతో కలసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మొగిలిగుంట రవి, ఇరగరాజు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పేదలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న 786 సేవాసంఘు వ్యవస్థాపకులు రఫీ

నాయుడుపేటటౌన్: 786 సేవాసంఘం వ్యవస్థాపకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ పార్టీలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని జామియా మసీదు ముతవల్లీ హాజీ రహ్మతుల్లా సాహేబ్ అన్నారు. పట్టణంలోని 786 కార్యాలయం వద్ద షేక్ రఫీ దాతృత్వంతో రంజాన్‌ను పురస్కరించుకుని 900 మందికి పైగా చీరలతో పాటు వారికి ఫిత్రాగా నగదును అందించారు. కార్యక్రమంలో జామియా మసీదుకు మౌలాన అబూబక్కర్, మత పెద్దలు ఉన్నారు.

అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించాం
- వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందాం
- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఎగువతాగేలి గ్రామంలో సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం ఎగువతాగేలి, నందిమాల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి జగన్ సర్కార్ అందించిన సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌ను అందించి లబ్ధిదారులకు ప్రభుత్వ పనితీరును వివరించారు. గడిచిన నాలుగేళ్లలో కోవిడ్ కష్టాలు, చంద్రబాబు పాలనలో టీడీపీ మిగిల్చిన అప్పులను అధిగమిస్తూ ప్రజా శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అంటూ ఎమ్మెల్యే కొనియాడారు. టీడీపీ నాయకులు చెప్పే అబద్ధాలు నమ్మకుండా నీతి, నిజాయితీకి పట్టం కట్టాలన్నారు. 2024లో మరోమారు జగనన్నను మనసారా దీవించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధర్మయ్య, వెంకటయ్య, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిసిల్లా, ఎంపీటీసీలు బెల్లపు రాఘవరెడ్డి, కుమారస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు మారాబత్తిన సుధాకర్, కరణం రఘునాయుడు, నాయకులు ఒబ్బు వెంకటరత్నం, చక్రపాణి, నాగరాజు, కృష్ణయ్య వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతంగా ఉండాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతంగా ఉండాలని, భోజనం తయారీలో ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య భోజన నిర్వాహకులకు సూచించారు. గురువారం చెంబేడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు మెనూ అమలు చేయడంతో పాటు శుభ్రత పాటించాలన్నారు. పాఠశాల ఆవరణలో తినుబండారాలు విక్రయానికి అనుమతులు ఇవ్వడం వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ఆయన వెంట హెచ్ఎం శంకరయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, సీఐ సోమయ్య, ఎస్ఐ కృష్ణారెడ్డి ఉన్నారు.

జనరంజకంగా జగనన్న పాలన



స్థానికుల సమస్యలను వింటూ వినతిపత్రాలు స్వీకరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

బాలాయపల్లి (వెంకటగిరి): దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా జగనన్న పాలన జనరంజకంగా సాగుతోందని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. బాలాయపల్లి మండలం నిండలి, వాక్యం గ్రామాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ తాళ్లూరు వెంకటప్రసాద్, ఎంపీటీసీ వి సురేంద్ర, రాయిదేవికాచౌదరి, అల్లం రాజా, నిండలి సర్పంచ్ ఎల్లంటి కృష్ణయ్య, రత్నంరాజు, సుధాకర్‌రాజు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా...

వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంబంధిత అధికారులద్వారా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆయన నివాసంలో పలు సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్ బాలయ్య, వెంకటగిరి జేసీఎస్ ఇన్‌చార్జ్ పులిప్రసాద్ రెడ్డి, నేతలు బండిరమేష్‌రెడ్డి, మంగళపురి వెంకటేశ్వర్లు, పామూరు అనీల్‌యాదవ్, వి జనార్దన్, మార్లగుంట వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష

సైదాపురం: జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామ రక్షగా నిలుస్తాయని ఏఎంసీ చైర్మన్ గుంటమడుగు శ్రీనివాసులురాజు పేర్కొన్నారు. మండలంలోని రాజుల ఎరుగుంట పాళెంలో గురువారం జేఎస్‌సీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్ అధ్యక్షతన వలంటీర్లు, గృహ సారథులు, స్థానిక నాయకులు జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

నిరుపేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం

రాపూరు: రాష్ట్రంలో నిరుపేదల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని సచివాలయ కన్వీనర్లు పిచ్చిరెడ్డి, ఆరీఫా, రమణయ్య అన్నారు. పట్టణంలో గురువారం వాడవాడలా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

కోట్లు కాజేసిన మీరా మాట్లాడేది ?

- టీడీపీ నేతలపై వైఎస్సార్‌సీపీ నాయకుల ఫైర్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నాయుడుపేటటౌన్ : నీరు-చెట్టు పనులు, జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు రూ.కోట్లు దిగమింగి, ఇప్పుడు మా నాయకులు వేనాటి సతీష్ రెడ్డి ఎమ్మెల్యే సంజీవయ్యపై విమర్శలు చేయడం ఏంటని స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. నాయుడుపేట పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు, పార్టీపై బురద జల్లే ప్రయత్నాలను తిప్పికొట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుమారు రూ.400 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగినా, టీడీపీ నాయకులు కళ్లు లేని కబోదుల్లా అభివృద్ధి జరగలేదని మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యే సంజీవయ్య సారథ్యంలో జరిగిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమా ? అని టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు స్థాయి మరచి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేకపోతే మా కార్యకర్తలే సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ మాధవ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెంచయ్య, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, రవి, నాగార్జున, చదలవాడ కుమార్, మహేష్ ఉన్నారు.

ఆటోనగర్‌లో ప్లాట్ల ధరలు తగ్గించండి



ఆటోనగర్ విషయంపై చర్చిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: ఆటోనగర్‌లో ఏర్పాటు చేసే ప్లాట్ల ధరలను తక్కువకే అందించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్‌ను గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కోరారు. గురువారం తాడేపల్లిలోని సెక్రటేరియట్‌లో ఎండీని కలసి ఈ మేరకు కోరడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మెకానిక్ షెడ్లు, తోడపు మిషన్లు, కొయ్యల మిషన్ ఇతరత్రా వాటి ద్వారా పట్టణం కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. ఈ మేరకు పట్టణానికి దూరంగా ఆటోనగర్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో అందరూ ఆటోనగర్‌కు రావాలంటే, అక్కడ ప్లాట్లకు కేటాయించే ధరలు అందరికీ అనుకూలంగా ఉంటేనే వస్తారనే విషయాన్ని ఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అలాగే ఆ భూమి ప్రభుత్వానికి సంబంధించినది కావడంతో అందుకు వారు సుముఖత వ్యక్తం చేశారని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ ఉషారాణి అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన పనులకు సంబంధించి ఆడిట్ జరిగిందన్నారు. ఈ ఆడిట్ వివరాలకు సంబంధించిన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పోలేరమ్మ జాతర నిర్వహణపై సమీక్ష



జాతర నిర్వహణపై సమీక్షిస్తున్న ఆర్డీఓ చంద్రముని, డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

నాయుడుపేటటౌన్: నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అంతా సహకరించాలని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి కోరారు. పోలేరమ్మ ఆలయ సమీపంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి పాయసం శాంతారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, పోలీసు, ఇతర శాఖల అధికారులు, జాతర నిర్వహణ కమిటీతో గురువారం సాయంత్రం వారు ప్రత్యేక సమావేశం జరిపారు. ఈ నెల 30 నుంచి మే 3వ తేదీ వరకు జరిగే జాతరకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతర ఘట్టంలో సమస్యాత్మకంగా ఉండే అంశాలు, పోలేరమ్మ విగ్రహం తయారీ మొదలుకుని నిమజ్జనం వరకు జరిగే కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో సమీక్షించారు. అలాగే పోలేరమ్మ ఊరేగింపుగా వచ్చి ఆలయం వద్ద కొలువు తీరే విధానం. నగరోత్సవంలో నిమజ్జనానికి తరలివెళ్లే వరకు నిర్వహించే జాతర ఘట్టాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ముఖ్యంగా విన్నమాల గ్రామస్తులు జాతర వేడుకల్లో కీలకంగా వ్యవహరించే విషయాలపై పెద్దకాపు శ్రీనివాసులు రెడ్డి, గ్రామ పెద్దలతో చర్చించారు. ఈ వేడుకలను సజావుగా జరిపేందుకు అందరు సహకరించాలని ఆర్డీఓ, డీఎస్పీ కోరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో అధికారులు, ప్రజల సహకారంతో జాతరను వైభవంగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గంధవళ్లి సిద్దయ్య తెలిపారు. సమావేశంలో సీఐలు వైవీ సోమయ్య, నర్సింహారావు, దేవదాయశాఖ గూడూరు ఇన్‌స్పెక్టర్ శ్రీలత, తహసీల్దారు రాజేంద్ర, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను ఆశీర్వదించండి



ఓజిలి: బీసీకాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న హరనాథ్‌రెడ్డి



నాయుడుపేట: మేనకూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో కట్టా వెంకటరమణారెడ్డి

ఓజిలి: రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం పనిచేస్తూ వారి అభివృద్ధికి నవరత్నాల పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉప సర్పంచ్ ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి అన్నారు. మానమాల గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

చిల్లకూరులో..



చిల్లకూరులో..

చిల్లకూరు: మండలంలోని కడివేడు పంచాయతీ పరిధిలో గురువారం జగనన్ననే మా భవిష్యత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికీ గృహ సారథులతో కలసి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ మనోజ్‌రెడ్డి, నాయకులు జక్కంరెడ్డి మధుసూదన్ రెడ్డి, గృహసారథులు పాల్గొన్నారు.

మాట తప్పే నైజం సీఎం జగనన్నకు లేదు

నాయుడుపేట: మండలం మేనకూరులో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు. సర్పంచ్ సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

త్వరలోనే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు



రికార్డులు పరిశీలిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ అధికారి గిరిబాబు

చిల్లకూరు : భూముల రిజిస్ట్రేషన్లు ఇకపై సలభతరం కానున్నాయని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారి గిరిబాబు తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు సచివాలయంలో ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన మీభూమి మీహక్కు అనే పథకం ద్వారా ఎక్కడికక్కడే రిజిస్ట్రేషన్ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ లేకుండా తెల్లకాగితాలపై రాయించుకుని అటు తరువాత వాటిపై హక్కులు పొందలేకపోతున్నారని తెలిపారు. అలాంటి వారికి సమీపంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా సచివాలయంలోనే చేస్తామన్నారు. సచివాలయాల్లో ఇకపై వివాహాలు, ఇళ్ల స్థలాలు, భూములు, సంస్థల రిజిస్ట్రేషన్లు కూడా చేసుకోవచ్చన్నారు. అనంతరం ముత్యాలపాడు, పెంటపాడు రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన భూముల రికార్డులను తనిఖీ చేశారు. గూడూరు సబ్ రిజిస్ట్రార్ మురళీకృష్ణ బాబు, పంచాయతీ కార్యదర్శి రవి, వీఆర్‌ఓ రమణయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శివాలయాల సముదాయం వద్ద గురువారం ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక హోమ, పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈక్రమంలో ఈ నాలుగు ఆలయాల వద్ద గురువారం ఉదయం నుంచి వేదపండితులు, ఆలయ అర్చకుల నేతృత్వంలో విఘ్నేశ్వర, కలశ స్థాపన, సంకల్పం, పుణ్యాహవచనం, ప్రత్యేక పూజలతో పాటు హోమపూజలు జరిపించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణి

వెంకటగిరి: రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) సాధనకు అధికారులు కృషిచేయాలని గూడూరు డీఎల్‌డీవో వాణి తెలియజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె స్థానిక సీడీపీవోతో కలిసి వెంకటగిరి రూరల్, అర్బన్ సచివాలయాల సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ ఏఎన్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్‌డీజీ లక్ష్యాల సాధనకు సచివాలయాల్లో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం బంగారుపేట వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవి రామయ్య, ఎంపీడీవో కరీముల్లా, సీడీపీవో షంషద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్నిమాపక యంత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్



అగ్నిమాపక పరికరాల పనితీరును వివరిస్తున్న శ్యామ్‌బాబు

సూళ్లూరుపేట : ప్రస్తుతం వేసవి కాలం గనుక ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలంతా అగ్నిప్రమాదాల పట్ల అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ కన్నంబాక రవి కుమార్ తెలిపారు. ఏపీ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ సంయుక్తంగా ఈనెల 14 నుంచి 20 దాకా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి గురువారం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. గత వారం రోజులుగా అగ్నిప్రమాదాలు జరగడానికి ఎక్కువగా అవకాశాలు ఉన్న మల్టీ స్టోర్ బిల్డింగ్, ఫ్యాక్టరీలు, గ్యాస్ గోదాములు, పెట్రోల్ బంకులు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఆర్టీసీ గ్యారేజీ, హాస్పిటళ్లు, ఫంక్షన్ హాలు వద్ద మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాల సమయాల్లో ఎలాంటి పరికరాలు ఉపయోగించి ప్రమాదాలను నివారణపై విద్యార్థులకు వివరించారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే సూళ్లూరుపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా స్కూళ్లు, అపార్ట్‌మెంట్లు, గ్యాస్ గోదాములతో పాటు అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోటల్లా ప్రాథమికంగా ప్రమాదాలను నివారించే యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి రఘునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నివారణపై అవగాహన

నాయుడుపేటటౌన్: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించాలని స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి శ్యామ్‌బాబు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అగ్నిమాపక కార్యాలయంలో స్థానికులతో పాటు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు 101కు గానీ కార్యాలయం 08623277301 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి

గూడూరు: వేసవిలో జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాల నుంచి, ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించవచ్చని అగ్నిమాపక శాఖ అధికారి చలమయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాటాడారు. ఈ వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలను నివారించే విధానాల గురించి వివరించి, కరపత్రాలను పంపిణీ చేశామన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

వెంకటగిరి: స్థానిక వెంకటగిరి అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి ఏడు రోజుల పాటు నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు గురువారం ముగిశాయి. కేంద్రీయ విద్యాలయ విద్యార్థులతోపాటు స్థానికులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి నారాయణ తెలియజేశారు.

రాపూరులో..

రాపూరు: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా రాపూరు కార్యాలయంలో గురువారం నివారణ పరికరాలను ప్రదర్శించినట్లు అగ్నిమాపక అధికారి కుప్పయ్య తెలిపారు. ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బంది ఏఏ రకాల వస్తువులను వినియోగిస్తారో విద్యార్థులకు వివరించామన్నారు.